వీధి కుక్కలు.. పందులతో పరేషాన్!

కాలనీవాసుల సర్వత్రా ఆందోళన
- పట్టించుకోని అధికారులు
- పాదచారులకు తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలబారిన వాహనదారులు

హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో వీధి కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కుక్కలు, పందులతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హస్తినాపురం: విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో ఎక్కడికక్కడ పిచ్చిమొక్కలు పెరిగి పోయాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో ఒకవైపు వీధి కుక్కలు మరో వైపు పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయి.

- పందులు, కుక్కలను తిరగకుండా చూడాలని అధికారులకు పలుమార్లు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీలో వీధి కుక్కలు, పందుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


కాలనీలో తిరుగుతున్న వీధి కుక్కలు


కాలనీలో పెరిగిన గడ్డిలో తిరుగుతున్న పందులు

పిచ్చి మొక్కలను తొలగించాలి...



కాలనీ అంతర్గత రోడ్లలో పెరగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. గత కొన్ని నెలలుగా పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రభలుతున్నాయి. ప్రాణాంతకమైన వ్యాధులు డెంగ్యూ వంటి వ్యాధులు సోకుతున్నాయి. వెంటనే ఉన్నతాధికారలు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– అమర్‌నాథ్ యాదవ్, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ

కుక్కలు, పందులను అరికట్టాలి



విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో వీధి కుక్కలు, పందుల బెడద విపరీతంగా ఉంది. ముఖ్యంగా పందుల వల్ల అంటువ్యాధులు సోకి కాలనీవాసులు ఆస్పత్రుల పాలవుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వాటి నుంచి విముక్తి కల్పించాలి.
– శేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

వీధి కుక్కలపై స్పెషల్ డ్రైవ్

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ కాప్రా, ఉప్పల్, హయత్ నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా డాగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసి వీధికుక్కల స్వైర విహారానికి చెక్ పెడతామని సర్కిల్ డీసీ మారుతీదివాకర్ అన్నారు. సోమవారం ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో వీధికుక్కల స్వైర విహారం వాటి ఆవాసాల ప్రాంతాలలో ర్యాలీని నిర్వహించి కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మారుతీదివాకర్ మాట్లాడుతూ... కాలనీవాసులు వీధి కుక్కలను చూసి పరుగెత్తటం, నిద్రిస్తున్న, ఆకలి, పిల్లలతో ఉన్న కుక్కలను తరమి కొట్టడం వంటి చర్యలు చేపడితే అవి కోపంతో మనుషులపై దాడి చేస్తాయని అన్నారు. కాలనీలో స్వైర విహారం చేసే వీధి కుక్కల సమాచారాన్ని ఫోన్: 040 2111 1111లో ఇవ్వవలసిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో సర్కిల్ డీసీలు కృష్ణయ్య, అరుణకుమారి, శంకర్, సురేందర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్‌లు డాక్టర్ రంజిత్, వెటర్నరీ ఆఫీసర్లు జీవ్యనాయక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సర్కిల్ డీసీలు

త్వరలో ‘టిమ్స్’ పనులు ప్రారంభం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి (టిమ్స్) ఏర్పాటు చేస్తుందని, అనుమతులు చివరి దశలో ఉన్నాయని త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం టిమ్స్ నిర్మాణ స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కార్మికుల కోసం తాత్కాలికంగా నిర్మిస్తున్న షెడ్డుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగరానికి నాలుగు వైపుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తోందన్నారు. కొత్తపేటలో రూ. 668 కోట్ల వ్యయంతో చేపట్టబోయే ఆస్పత్రి నిర్మాణ టెండర్‌ను ఎల్ అండ్ టీ సంస్థ దక్కించుకుందన్నారు.

ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం..
కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి అడ్డుపడుతున్నాయని ఎన్ని అవరోధాలు ఎదురైనా టిమ్స్ నిర్మాణాన్ని పూర్తి చేయటం ఖాయం అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయటాన్ని జీర్ణించుకో లేక తనపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. ప్రజల ఆర్థిక అభివృద్ధి, ప్రజా సంక్షేమ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలోని టిమ్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మంత్రి హరీష్‌రావు రాజీనామా చేయాలి

- పాలకుల అసమర్థత వల్లే విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు
- కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ ఛైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో పాలకుల అసమర్థత వల్లే విద్యార్థుల హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని, వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు నైతిక బాధ్యత వహించి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు తన పదవికి రాజీనామా చేయాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ ఛైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యా నియంత్రణ జేఏసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మెడికో స్టూడెంట్ ప్రీతినాయక్, ఇంజినీరింగ్ విద్యార్థిని రక్షిత మరణాలపై హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నోజు మాట్లాడుతూ... గిరిజన విద్యార్థిని ప్రీతినాయక్ మరణానికి కారకులైన మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని, ప్రీతి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందజేసి, గ్రూప్–1 ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు అడ్వకేట్ పోలే విష్ణు, కోట్ల వాసుదేవ్, మహిళా సంఘాల నాయకురాలు పి.రాణి, లింగమ్మ, బహుజన సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దున్న బాలకృష్ణ, వినోద్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


హస్తినాపురం చౌరస్తాలో నివాళులర్పిస్తున్న చెన్నోజు తదితరులు

క్లుప్తంగా

మరణిస్తూ మరో నలుగురికి కొత్త జీవితం


రమేష్ (ఫైల్)

మన్సూరాబాద్: ప్రైవేటు బస్ డ్రైవర్ తాను మరణిస్తూ మరో నలుగురికి సరికొత్త జీవితాన్ని ప్రసాదించాడు. జీవన్‌దాన్ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్ మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన పాలపాటి రమేష్(43) ప్రైవేటు బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 23న సాయంత్రం ఓ ఫిలిం సిటీ వద్ద ఆర్టీసీ బస్ ఢీ కొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌కు తరలించారు. చికిత్సకు రమేష్ స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు రమేష్ భార్య సుప్రజ, తండ్రి పోచయ్యతో పాటు కుటుంబసభ్యులకు అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు రమేష్ రెండు కిడ్నీలు, రెండు కార్నియాలను దానం చేశారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి

మన్సూరాబాద్: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజాల జగన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ వీకర్ సెక్షన్ కాలనీలో సోమవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి గీతామూర్తితో పాటు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు కాసం వెంకటేశ్వర్లు, రాంచంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ... రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన నడుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, శ్యామల, కవితారెడ్డి, కర్నాటి మాధవి, నాంపల్లి శంకరయ్య, మూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమతా డిగ్రీ కాలేజ్, డామ్నిక్స్ స్కూల్, అక్బర్‌బాగ్, ఆర్య సమాజ్, ఈద్గా, స్టాండ్లీ స్కూల్, ఫైర్ స్టేషన్, అమీర్ ఫాతిమా మాస్క్, సాయిదీప్ అపార్ట్‌మెంట్, సీ బ్లాక్ క్వార్టర్స్, అక్బర్‌బాగ్ క్రాస్‌రోడ్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం నుంచి 3:30 గంటల వరకు న్యూమలక్‌పేట్, ఫుట్‌బాల్ గ్రౌండ్, కాలడేరా కాలనీ, కాలడేరా స్లమ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 వరకు శంకర్‌నగర్, విద్యానగర్, కిసాన్ దొడ్డి, ఓల్డ్ శంకర్‌నగర్, సరోజినగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వండి

- నియోజకవర్గ నిధుల సద్వినియోగంలో ఎమ్మెల్యే విఫలం
- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం: నియోజకవర్గ నిధులను వినియోగించడంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విఫలమయ్యారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఆదివారం రాత్రి వనస్థలిపురం డివిజన్ శక్తినగర్‌లో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ కార్పొరేటర్ల విషయంలో ప్రొటోకాల్ పాటించకుండా ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలు పోతున్నారని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ కేసీఆర్ ప్రభుత్వం దివాళా తీయించిందన్నారు. రిజిస్ట్రేషన్ల సమస్యపై తీసుకొచ్చిన జీవోకు మళ్లీ సవరణలు అంటున్నారని, ప్రభుత్వ పెద్దల జేబులు నింపేందుకే ఈ జీవోలని ఆరోపించారు. ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్న ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెప్పి, ఈ సారి ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నేతలు కొత్త రవీందర్‌గౌడ్, నూతి శ్రీనివాస్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అంజన్‌కుమార్‌గౌడ్, రజిని పటేల్, శ్రీనివాస్, సలీం తదితరులు పాల్గొన్నారు.


శక్తినగర్‌లో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

అక్రమ నిర్మాణం కూల్చివేత

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ మన్సూరాబాద్ గ్రామ సర్వే నెంబర్ 93లోని సాయిభవానీనగర్ కాలనీ పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని సోమవారం అధికారులు కూల్చివేశారు. సరూర్‌నగర్ మండల తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవిన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో కూల్చివేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మూగ అమ్మాయి.. చెవిటి అబ్బాయి వివాహానికి చేయూత



నాగోలు: నిరుపేద కుటుంబాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత అందిస్తుందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్, ఉప్పల ఫౌండేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మల్కాజిగిరి చెర్లపల్లికి చెందిన రోజువారీ కూలి చేసుకునే పేద వైశ్య కుటుంబానికి చెందిన మూగ అమ్మాయి లహరి వివాహం కోసం ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సోమవారం నివాసానికి వచ్చి కలిశారు. వారికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌గుప్తా, స్వప్న దంపతులు మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను విరాళంగా అందజేశారు.

శ్రీరామ అయోధ్యనగర్ కాలనీ కార్యవర్గం


ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరామ అయోధ్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా పి.సుదర్శన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఎ. వెంకటాచారి, ఉపాధ్యక్షులుగా కె.నవీన్, జి.వెంకట్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బి.దుర్గయ్య, ఎస్.వి.ఆర్.చౌదరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్.నర్సింహ, పి.సురేశ్ యు.శ్రీశైలం, కార్యవర్గ సభ్యులుగా యు.రాము, కె.జంగారెడ్డి, వి.జంగయ్య, కె.జంగయ్య ఎన్నికయ్యారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయండి

వనస్థలిపురం: మిర్యాలగూడలో మార్చి 1, 2, 3వ తేదీలలో జరిగే గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపి నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఎల్‌బీనగర్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనుల సంక్షేమం కోసం గిరిజన బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి చావుకు కారకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు శ్రీను నాయక్, దాస్యనాయక్, నగేష్ నాయక్, హర్యానాయక్, పాండు నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం



IN THE COURT OF THE HON'BLE ADDL.SENIOR CIVIL JUDGE, IBRAHIMPATNAM, RANGA REDDY DISTRICT
AT: IBRAHIMPATNAM
I.A.NO. 144 OF 2023
IN
O.S.NO. 1635 OF 2012

Between:
Dr.K.Jyothinandan Reddy, rep.by his G.P.A, Holder Sri.K.Gyana Swaroop Reddy ...Petitioner/Plaintiff
And
Tinglikar Raju and others ...Respondents/Defendants

Take notice that, the Petitioner/ Plaintiff filed the suit for Declaration and Injunction and correction of Revenue records in respect of the suit schedule property against Defendant Nos.1 & 2 namely Tinglikar Raju and Buyankar Darshan and later on the Petitioner/Plaintiff has taken the steps to implead you as Defendant Nos.4 to 6 & 8 and during the enquiry process you willfully not received the Hon'ble court summons and in that result the Hon'ble court have ordered to implead you as Defendants in the above main suit, and thereafter as per the due procedure of law the Petitioner/Plaintiff filed Amendment neat copy of Plaint in the above suit before the Hon'ble court and the Hon'ble court issued the fresh summons to you and also directed the Petitioner/Plaintiff to serve the notices through Courier, so as per the directions of the Hon'ble court the Petitioner/Plaintiff got served the notices through D.T.D.C courier by enclosing the Amendment Neat copy of Plaint, but you Defendant Nos.4 to 6 & 8 did not receive the said notices even you are residing on the same address, the parties names as follows:
4.Sundru Phani Teja, S/o.S. Paluguan Babu, aged about 32 years, Occ:Pvt.,Employee, R/o.H.No.32-35-10, A.Jamindar Street, Mylavaram, Krishna District-521230.
5.Nagannagari Masi Reddy, S/o.N. Narasimha Reddy, aged about 43 years, Occ: Business, R/o.Plot No.26-A, Ampro Colony, Lingojiguda, Saroornagar, Hyderabad-500035.
6. Smt.Nagannagari Latha, W/o.N. Masi Reddy, aged about 38 years, Occ:House wife, R/o.Plot No.26-A, Ampro Colony, Lingojiguda, Saroornagar, Hyderabad-500035.
8.Smt.Sama Amaravathi, D/o. Narsimha Reddy, aged not known to the Petitioner/ Plaintiff, R/o.Plot No.26-A, Ampro Colony, Lingojiguda, Saroornagar, Hyderabad-500035.
hence as per the request of the Petitioner/ Plaintiff the Hon'ble court passed orders on 10.02.2023in the above I.A., i.e. substitute service for serving the court notices through this Paper publication and posted matter on 07.03.2023 for your appearance at 10:30AM before the Hon'ble court, hence you Defendant Nos.4 to 6 & 8 should appear before the court on the said date and time without fail, otherwise the Hon'ble court will take appropriate steps against you, hence this notice.
Place : Ibrahimpatnam
Date : 28.02.2023
Counsel for the Petitioner/Plaintiff
M/S. M. YADAGIRI REDDY & B.OM REDDY, ADVOCATES
OFFICE AT 8-4-17/241/1, SAI RAM NAGAR COLONY, KARMANGHAT, HYDERABAD-079. CELL: 8121087143

తెలంగాణలో కుటుంబ పాలన అంతమే లక్ష్యం

- ప్రతి ఒక్కరినీ చైతన్యం చేస్తున్నాం
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

మలక్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కుటుంబ పాలనను అంతం చేయాలనే లక్ష్యంగా తెలంగాణలో బీజేపీ ముందుకు సాగుతోందని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గౌర విజయకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్‌కుమార్, సీనియర్ నేత జెక్కా మోహన్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రజాగోస–బీజేపీ భరోసా నినాదంతో ఆదివారం రాత్రి నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు అర్వింద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు పడుతున్న గోసను ఎండగట్టి.. ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన విధానాన్ని ప్రజలకు వద్దకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రధాని మోదీ సమాజాన్ని ఒకటిగా చేయాలనే ఆలోచనతో ముందుకెళ్తుంటే.. కేసీఆర్ కులాల పేరుతో విడగొట్టి విద్వేషాలు రేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాప కింద నీరులా బీజేపీ వ్యాపిస్తోందని, రాబోయే ఎన్నికల్లో కాషాయ జెండా గెలుపు అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. కేసీఆర్‌ను ఎందుకు గెలిపిచామని తెలంగాణ సమాజం తలకొట్టుకుంటోందదన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి కొండ సంపత్ ఆధ్వర్యంలో జరిగిన మీటింగ్‌లో నేతలు వై.సురేందర్, రమేష్‌రెడ్డి, కొంగర ప్రవీణ్, శశికాంత్, సంతోష్, సుందర్, భరత్‌కుమార్, లక్ష్మారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, పక్కన కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు


ప్రీతి ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మన్సూరాబాద్: మెడికో ప్రీతి ఆత్మహత్య చేసుకునేందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చైతన్యపురి: కాలనీలలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సత్వరమే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. పీఅండ్‌టీ కాలనీలోని నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందంటూ కాలనీవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన మంగళవారం వాటర్ వర్క్స్ సిబ్బందిని తీసుకుని ఆ కాలనీని సందర్శించారు. సమస్య ఉన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించిన కార్పొరేటర్ సమస్య పరిష్కరించారు. ఎటువంటి సమస్య ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే వెంటనే పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు.


పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

కత్తితో బెదిరించి గొలుసు దోపిడీ

హయత్‌నగర్: కిరాణా షాపుల్లోని మహిళే టార్గెట్‌గా దుండగులు కత్తులతో బెదిరించి దోపిడీలకు తెగబడుతున్నారు. పట్టపగలే దొంగలు రెచ్చిపోతూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. గత శుక్రవారం ఓ కిరాణా షాపులో ఉన్న మహిళను బెదిరించి బంగారు గొలుసు, నగదు దోపిడీ చేసిన సంఘటన మరువకముందే సోమవారం లెక్చరర్స్ కాలనీలో అలాంటిదే మరో సంఘటన వెలుగుచూసింది. శుక్రవారం జరిగిన సంఘటనలో గొలుసు దుండగుల చేతిలో నుంచి జారిపడగా సోమవారం సంఘటలో దుండగులు దోపిడీ చేసింది వన్‌గ్రాం గోల్డ్ (రోల్డ్‌గోల్డ్) గొలుసు కావడం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం... లెక్చరర్స్ కాలనీలో నివసించే సునీత అదే కాలనీలో అంజయ్య కిరాణా షాపు నడుపుతోంది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో నల్లటి పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు సునిత ఒంటరిగా ఉండటాన్ని చూసి కత్తి మెడపై పెట్టి మెడలోని గొలుసు ఇవ్వాలని బెదిరించారు. బెదిరిపోయిన ఆమె మెడలోని గొలుసును తీసి ఇచ్చింది. దుండగులు తీసుకెళ్లిన గొలుసు రోల్డు గోల్డ్‌ది కాగా ఆ గొలుసుకు సుమారు 8 గ్రాముల బంగారు పుస్తెలు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మన్సూరాబాద్: నేషనల్ రోడ్ సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా ఎల్‌బీనగర్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డులో వాహనదారులకు హెల్మెట్ వినియోగం, నెంబర్ ప్లేట్స్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ సరిగా పెట్టుకున్న వాహనదారులకు, నెంబర్ ప్లేట్స్ సరిగా ఉన్న వాహనదారులకు చాక్లెట్స్ గిఫ్టుగా ఇచ్చారు.

కొవ్వొత్తులతో బీజేపీ నేతల ప్రదర్శన



నాగోలు: గిరిజన బిడ్డ డాక్టర్ ప్రీతి మృతి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని బీజేపీ నాయకులు బోల్గం సాయినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొత్తపేటలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో కొత్తపేట కార్పొరేటర్ పవన్ కుమార్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సుందర్ నారాయణ, ఉపేందర్ సింగ్, రామకృష్ణ, సైదులు, కిరణ్ కుమార్, రాకేష్ యాదవ్, గట్టు మహేష్, భరత్ రెడ్డి, రైక శ్రీనివాస్, శరణ్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365